సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 4 । జూలై । 2024



సోమశిలలో 10.149 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 10.149 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 354 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు 210 కూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,440
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,685
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,885
సవర (8 గ్రాములు)	రూ.55,080

గరిష్టం/కనిష్టం
37.6 /29.9

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం సమ్మిళితం గా ఉంటుంది. మేఘావృతమై ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ చిరు జల్లులు కురుస్తాయి. పగలు వేడి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు నెల్లూరుకు వైఎస్ జగన్ రాక

నెల్లూరు (పొగతోట): మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 4వ తేదీ ఉదయం నెల్లూరుకు రానున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం పర్యటనలో స్వల్ప మార్పులు జరిగాయన్నారు. 4న ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లి నుంచి బయలుదేరి 11.15 గంటలకు నెల్లూరు కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాఖత్ అవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చేరుకుని హెలికాప్టర్ ద్వారా తాడేపల్లికి బయలుదేరుతారని వివరించారు.

వైఎస్ జగన్‌తో ప్రసన్న భేటీ



వైఎస్ జగన్‌ను కలిసిన ప్రసన్న, రజత్

కోవూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కోవూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన తనయుడు కోవూరు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో, ఆ తర్వాత టీడీపీ సాగించిన అరాచకాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు. మనం చేసిన మంచి పనులు, అందించిన సంక్షేమ పథకాలు ప్రజల్లో ఇంకా గుర్తున్నాయని, త్వరలోనే ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని వైఎస్ జగన్ చెప్పారని ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. భవిష్యత్ మనదే అని, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ఉండి పోరాడటానికి సిద్ధంగా ఉండాలని చెప్పారని, అందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకరణ నేడు



నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కావలి ఆర్డీఓ శీనానాయక్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన ఓ ఆనంద్ బుధవారం నెల్లూరుకు చేరుకున్నారు. విజయవాడ నుంచి నెల్లూరుకు చేరుకున్న కలెక్టర్‌కు చింతారెడ్డిపాళెం హైవే వద్ద నెల్లూరు రూరల్ తహసీల్దారు సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్న నూతన కలెక్టర్‌కు కావలి ఆర్డీఓ శీనానాయక్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మూడో విద్యుత్ యూనిట్లో ఓవరాలింగ్

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 520 మెగావాట్లు, 2వ యూనిట్లో 540 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. 3వ యూనిట్లో ఓవరాలింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తి నిలిపివేశామన్నారు.

వైద్యశాఖలో డాక్టర్‌కు డిప్యుటేషన్ రద్దు

నెల్లూరు (అర్బన్): నైతిక విలువల నేపథ్యంలో పలు ఆరోపణలు ఎదుర్కొంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ డాక్టర్ డిప్యుటేషన్‌ను రద్దు చేసినట్లు బుధవారం డీఎంహెచ్ఓ పెంచలయ్య తెలిపారు. ఆ డాక్టర్‌ను పోలీసులు కూడా ఒక కేసులో మంగళవారం రాత్రి పిలిపించి విచారణ జరిపారు. ఇదిలా ఉండగా వైద్యశాఖలో ఎంతో మంది సీనియర్ డాక్టర్లున్నారు. పని విభజన నేపథ్యంలో అవసరాన్ని బట్టి పీహెచ్‌సీల నుంచి వైద్యశాఖకు డిప్యుటేషన్‌పై డీఎంహెచ్ఓ నియమించుకోవచ్చు. సీనియర్‌లను కాదని సర్వీసులేని అత్యంత జూనియర్ డాక్టర్లను డిప్యుటేషన్‌పై నియమించుకోవడం, వారిపై పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో ఆ డాక్టర్ అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

ఇసుక రీచ్‌ల్లో పచ్చ దొంగలు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఆ పార్టీలోని ఇసుకాసురులు బరి తెగించారు. జిల్లాలోని సోమశిల నుంచి ఇందుకూరుపేట వరకు పెన్నాతీరంలోని రీచ్‌ల్లో పచ్చ ముఠాలు మాఫియాలుగా మారి దోపిడీ చేస్తున్నాయి. ఎనిమిది నియోజకవర్గాల్లోని దంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను ఖాళీ చేశారు. ఇక నేరుగా రీచ్‌లపై పడ్డారు. కలువాయి మండలం రాజుపాళెం పెన్నానదిని కుళ్లబొడుస్తున్నారు. మర్రిపాడులో ఇసుక డంపింగ్ యార్డ్‌లో నిల్వ చేసిన కొండంత గుట్ట ఖాళీ అయిపోయింది. కోవూరు వేగూరు, సుబ్బారెడ్డిపాళెం రీచ్‌ల నుంచి విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. వాశిలిలో అర్ధరాత్రి ఇసుక తరలింపును అడ్డుకున్న సర్పంచ్ పై దాడి చేశారు. సంగం రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై స్థానికులు కన్నెర్ర చేశారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, సెబ్, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారు.



మర్రిపాడు మండల కేంద్రంలో ప్రభుత్వ ఇసుక రీచ్ వద్ద లారీలకు ఇసుక లోడ్ చేయిస్తున్న దృశ్యం

కొత్త పాలసీపై ప్రభుత్వ నిర్ణయంలో జాప్యం

- ఊరూరా ఇసుక మాఫియాలు
- డంపింగ్ యార్డులు ఖాళీ చేసేశారు
- రేయింబవళ్లు భారీ వాహనాలతో కొల్లగొట్టేస్తున్న వైనం
- అక్రమ రవాణాను అడ్డుకోలేక చేతులెత్తేసిన అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనపై కంటే.. ఆ పార్టీ నేతలు ఇసుక వ్యాపారంపై దృష్టి పెట్టారు. ఇసుక దోపిడీకి లైసెన్స్ ఇచ్చినట్లు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నారు. ప్రభుత్వం ఇసుక పాలసీ అమలు చేయక ముందే ఈ నెల రోజుల్లోనే జిల్లా నుంచి సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా విలువైన ఇసుక నిల్వలు దోచేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు 'ఇసుక ఉచితం' పేరుతో రీచ్‌లను కుళ్లబొడిచేశారు. ఆ ఐదేళ్ల ఏ నాడు ప్రజలకు ఉచితంగా ఇవ్వలేదు. ఇసుక రీచ్‌ల్లో టీడీపీ కేడర్ మోహరించి ట్రాక్టర్‌కు ఇంత.. టిప్పర్‌కు ఇంత చొప్పున దోపిడీ చేసింది. అప్పట్లో వర్షాల్లేక నదుల్లో ఇసుక అడుగంటిపోయినప్పటికీ బావుల్లాంటి గోతులు పెట్టి సామాన్య కార్యకర్త నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకు రూ.కోట్లు కొల్లగొట్టారు. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక పాలసీ తెచ్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. ఇసుక విక్రయం ద్వారా వచ్చే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేర్చింది. దీంతో టీడీపీ ఇసుక దోపిడీకి కళ్లెం పడడంతో అప్పటి ప్రభుత్వంపై ఐదేళ్లుగా దుష్ప్రచారం చేసింది. ఇప్పుడు తిరిగి అధికారం రాగానే టీడీపీ కేడర్ మళ్లీ దోపిడీకి తెగబడుతోంది. ప్రకృతి వనరులను కాపాడాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్, సెబ్ అధికారులు అక్రమార్కులతో భాగస్వామ్యులై తమ జేబులు నింపుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికకు ముందు డంపింగ్ యార్డుల్లో కొండల్లాంటి ఇసుక కొండలు కరిగిపోయాయి.



మర్రిపాడు డంపింగ్ యార్డు వద్ద లోడ్ చేసిన ఇసుక లారీలకు పర్మిట్లు రాస్తున్న నిర్వాహకులు

అధికారులు కళ్లకు గంతలు..

జిల్లాలో అధికార పార్టీ నేతలు, అధికారుల సహకారంతో ఇసుక మాఫియా బరితెగించి నదీ గర్భాన్ని కుళ్లబొడిచి ఇసుక దోపిడీ చేస్తుంటే అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని మాకేంటీ సిగ్గు అన్నట్లుగా వ్యవహరిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు ఇసుక రవాణా సాగుతుంటే అ అక్రమార్జనలో వీరు భాగస్వామ్యులై ధ్రుతరాష్ట్ర పాత్ర పోషిస్తున్నారు. పేదోడు సొంత అవసరాలకు తట్టడు మట్టి ఎత్తుకుంటే వెంటనే పట్టేసే అధికారులు ఇసుకాసురులు బరి తెగించినా పట్టించుకోకపోవడం గమనార్హం .

డంపింగ్ యార్డులు ఖాళీ.. రీచ్‌లు కుళ్లబొడుస్తున్నారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక బ్లాక్ మార్కెట్, ట్రాన్స్‌పోర్టర్ల సిండికేట్‌కు చెక్ పెడుతూ ఇసుక పాలసీ తెచ్చింది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఇసుక డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. ఆయా డంపింగ్ కేంద్రాల్లో టన్ను ఇసుకకు రవాణా చార్జీలతో కలిసి చెల్లించితే నేరుగా కొనుగోలుదారుడి ఇంటి వద్దకే చేర్చే విధంగా అప్పటి ప్రభుత్వం విధి విధానాలు రూపొందించింది. అందులో భాగంగా సార్వత్రిక ఎన్నికల నాటికి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో డంపింగ్ యార్డుల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు పెట్టింది. ఎన్నికల నేపథ్యంలో ఇసుక విక్రయాలు నిలిచిపోయాయి. ఆ నిల్వలన్నీ ఇప్పుడు టీడీపీ ఇసుక మాఫియా ఖాళీ చేస్తోంది.

- నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాళెం రీచ్‌లో దాదాపు 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నాయి. టీడీపీ నేతలు టీడీపీ ప్రమాణస్వీకారానికి ముందే రాత్రి వేళల్లో వందలాది వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగించారు. ఇసుకను టీడీపీ నేతలు, కార్యకర్తలు దోచుకెళ్తున్నా.. ఏ అధికారి ఆ వైపు కన్నెత్తి చూసేందుకు సాహసం చేయలేదు. స్థానిక నేతలు రీచ్‌ల్లో భారీ యంత్రాలు ద్వారా ఇసుకను తవ్వి టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకున్నారు. టిప్పర్‌కు ఏడు, పది యూనిట్లు పరిమితికి మించి ఇసుక రవాణా సాగించారు. దాదాపు 100కు పైగా వాహనాలు ద్వారా రోజుకు 1000 యూనిట్లకు పైగా ఇసుక అక్రమ రవాణా చేసినట్లు సమాచారం. నరసింహకొండ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో నిల్వ ఉంచిన ఇసుక నిల్వలో సగం ఖాళీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- మర్రిపాడుకు రెండు కిలో మీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వం ఇసుక డంపింగ్ యార్డు ఏర్పాటు చేసింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే నాటికి మర్రిపాడు ఇసుక డంపింగ్ యార్డులో సుమారు 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను నిల్వ చేసింది. ఒక్కొక్క క్యూబిక్ మీటరు ఇసుక రూ.వెయ్యి వంతున ఈ మొత్తం విలువ దాదాపు రూ.10 కోట్లు ఉంటుంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మర్రిపాడు ఇసుక యార్డు నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజు నుంచే భారీ టిప్పర్ల ద్వారా అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. పక్క రాష్ట్రాలకు ఇసుక తరలించాలంటే బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీలు కూడా చేయడం లేదని తెలుస్తోంది. ఈ ఇసుక మాఫియాకు జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రముఖ నాయకుడి అండదండలు ఉండడం వల్ల ఏ అధికారి ఈ విషయంలో తలదూర్చేందుకు ఒణికిపోతున్నారని ప్రజల్లో తీవ్రమైన చర్చలు నడుస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇటీవల సాక్షిలో ఇసుక అక్రమ రవాణాపై కథనం వస్తే రెండు రోజుల పాటు మాత్రమే నిలిపివేసి మళ్లీ యథాతథంగా భారీ వాహనాలతో అక్రమ రవాణా చేస్తున్నారు. డంపింగ్‌యార్డు వద్ద స్థానిక రెవెన్యూ టీంను కాపలాగా పెట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో వారు కాపలా మాని కంటూ చేతులెత్తేయడంతో రెండు రోజుల నుంచి మర్రిపాడు నుంచి తమిళనాడు, కర్ణాటక ఇతర రాష్ట్రాలతో పాటు రాయలసీమ ప్రాంతాలకు నిత్యం 50 భారీ వాహనాలతో ఇసుకను తరలిస్తున్నారు. టీడీపీ డంపింగ్ యార్డు వద్దనే పర్మిట్లు రాసి ఇస్తుండడం గమనార్హం.

విచ్చలవిడిగా అక్రమ రవాణా దందా

కలువాయి మండలం రాజుపాళెం, తెలుగరాయపురం సమీపంలోని పెన్నా నది నుంచి నిత్యం వందల లారీలు ఇసుక తరలి వెళ్తుంది. స్థానిక ఎమ్మెల్యే నెల్లూరుకు చెందిన ఓ ఇసుక మాఫియాకు లైసెన్స్ ఇచ్చేశాడు. రోజువారీగా లారీలకు ఇంత చొప్పున ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధి ఇచ్చిన అనధికార లైసెన్స్‌తో ఇసుక మాఫియా బరితెగించింది. ప్రతి రోజు రాత్రి వేళల్లో వంద భారీ వాహనాలతో ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సగటున ఒక వాహనానికి 8 యూనిట్లు లెక్కన 3200 టన్నుల ఇసుక తరలిపోతుంది. ప్రతి వాహనానికి రూ.30 వేలు వంతున వసూళ్లు చేసుకుంటున్నారు. ఈ లెక్కన రూ. 3 కోట్ల ఇసుక ప్రతిరోజు అక్రమ రవాణా ఒక్క రాజుపాళెం పెన్నానది నుంచి వెళ్తోంది.

- ఆత్మకూరు నియోజకవర్గంలోని వాశిలి సమీపంలో ఉన్న పెన్నానది నుంచి రాత్రి వేళల్లో ఇసుక అక్రమరవాణా సాగిస్తున్నారు. నిత్యం 50 వాహనాలతో ఇసుక రవాణా జరుగుతోంది. మంగళవారం రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణాను వాశిలి గ్రామస్తులు అడ్డుకున్నారు. నిత్యం వాహనాలతో అక్రమ రవాణా చేయడంపై స్థానికులు భీతిల్లుతున్నారు. గ్రామం నుంచే వాహనాలు వెళ్తుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికలు అడ్డుకోవడంతో ఇసుక మాఫియా వారిపైనే దాడి చేసి వాహనాలను తీసుకెళ్లిపోయారంటే బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.
- నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల పరిధిలో కూడా ఇటీవల భారీగా ఇసుక అక్రమ రవాణా సాగింది. పల్లిపాడు, మినగల్లు ఇసుక డంపింగ్ యార్డుల నుంచి ఇసుకాసురులు రూ.కోట్ల విలువైన ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు.

మా దృష్టికి రాలేదు

ఇసుక అక్రమ రవాణా విషయం మా దృష్టికి రాలేదు. ప్రభుత్వం ఇప్పటికీ ఇసుక పాలసీ ప్రకటించలేదు. ప్రస్తుతం ఇసుక రవాణా నిలిపివేశాం. డంపింగ్ యార్డుల్లో ఇసుక ఎంత ఉందో కొలతలు వేసేందుకు సిబ్బందిని పంపిస్తాం. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. – ఎ. శ్రీనివాసకుమార్, డీడీ మైనింగ్ శాఖ

పరిపాలనకు మార్గదర్శకుడు జగన్

- శ్వేతపత్రాల విడుదల పేరుతో అబద్ధపు ప్రచారాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలు, పాలనపై విమర్శలు విడ్డూరం
- ఆయన పాలనా మార్క్ తుడిచేసేందుకు ప్రజలకు నరకం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు

నెల్లూరు (పొగతోట): సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, వలంటీర్ల వ్యవస్థతో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు దేశానికే ఆదర్శవంతమైన విప్లవాత్మక అభివృద్ధితో మార్గదర్శక పాలన సాగించారని అన్ని రాష్ట్రాలు కొనియాడుతుంటే, చంద్రబాబు తాను ఇచ్చిన హామీలు ఎగ్గొట్టేందుకు శ్వేతపత్రాలు విడుదల పేరుతో అబద్ధపు ప్రచారాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలు, జగన్ పాలనపై విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రతి నెలా ప్రతిష్టాత్మకంగా ఇంటి వద్దనే పింఛన్ నగదు అందజేయాలని రూపకల్పన చేసి అమలు చేసిందే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అయితే.. ఈ కార్యక్రమాన్ని టీడీపీ కూటమి అమలు చేసినట్లు నిస్సిగ్గుగా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకాణి మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి 1.34 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. మాజీ సీఎం నియమించిన సచివాలయాల ఉద్యోగుల ద్వారానే ఈ నెలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారన్నారు. రెండు రోజుల వ్యవధిలోనే పింఛన్లు పంపిణీ చేశామని చంకలు చరుచుకోవడం చూస్తే జనం నివ్వెరపోతున్నారు. వైఎస్ జగన్ తెచ్చిన వ్యవస్థతో పింఛన్లు పంపిణీ చేస్తూ వైఎస్సార్‌సీపీ విధానాలు, జగన్‌ను తప్పు పట్టినట్లు మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు.

ఇంటింటికీ పింఛన్ జగన్ ఆలోచనే..

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేద ప్రజల ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నారంటే.. ఆ ఆలోచన చేసిన వ్యక్తి జగనే అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ముందు టీడీపీ ప్రభుత్వంలో పేద ప్రజలు పింఛన్ల కోసం రోజుల తరబడి పడిగాపులు కాసిన పరిస్థితి మరిచిపోలేదన్నారు. మీకు మంచి మనసు ఉంటే ఈ ఆలోచన చేసి అమలు చేసిన జగన్‌ను అభినందించాలన్నారు. సీఎం చంద్రబాబు దీనిని అమలు చేసినట్లు కలరింగ్ ఇచ్చుకున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టి వారి కడుపులు కొట్టారన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.84 వేల కోట్లు

పింఛన్లకు సంబంధించి గతంలో టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.25 వేల కోట్లు పంపిణీ చేస్తే వైఎస్సార్‌సీపీ రూ.84 వేల కోట్లు ప్రజలకు పంపిణీ చేసిందన్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సూపర్ సిక్స్, ఇతర కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీకి సంబంధించిన వారి పింఛన్లు నిలిపివేస్తామని మాట్లాడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలు, ప్రాంతాలు, కులాలు చూడకుండా అర్హులైన వారందరికీ పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. అర్హులైన వారందరికి పింఛన్లు అందజేయాలన్నారు. పింఛన్లు అందించకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాడుతామని, అవసరమైతే న్యాయపోరాటం చేసి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.170 కోట్ల స్త్రీనిధి రుణాలు

- రికవరీలపై ప్రత్యేక దృష్టి
- స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామక్షయ్య

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.170 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య తెలిపారు. బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏరియా మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఏజీఎం మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీనిధి రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. స్త్రీనిధి రుణాలు మంజూరుకు ఎక్కడా ఎవరికీ ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన మహిళలందరికీ రుణాలు మంజూరు చేశామన్నారు. గతంలో స్త్రీనిధి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా మండలాలు ఏపీఎంలు, సీసీలు, వీఏఓలతో మాట్లాడి రికవరీలు వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఇందుకూరుపేట, ఉదయగిరి, పొదలకూరు ఏరియా మేనేజర్లు పాల్గొన్నారు.

జల్‌శక్తి అభియాన్ పథకం పనులను పరిశీలిస్తాం

- జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్ పట్నాయక్



అధికారులతో మాట్లాడుతున్న జల్‌శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్ పట్నాయక్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో వ్యవసాయ సీజన్ ముందే జల్‌శక్తి అభియాన్ పథకం పనులను పరిశీలిస్తామని జల్‌శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్ పట్నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జాయింట్ సెక్రటరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో జల్‌శక్తి అభియాన్ పథకం కింద చేపట్టిన వాటర్ షెడ్స్ చెరువులు, కుంటలు, అభివృద్ధి పనులన పరిశీలిస్తామన్నారు. జిల్లాలో జల్‌శక్తి అభియాన్ కింద తర్వాత భూగర్భ జలాలు పెరిగాయా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలిస్తామన్నారు. జల్‌శక్తి అభియాన్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలను పెంచడానికి అవసరమైన సూచనలు చేస్తామన్నారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 9.15 గంటలకు కలిగిరి మండలం సిద్ధనకొండూరు, నాగసముద్రం, కలిగిరి ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వింజమూరు మండలంలోని వింజమూరు, చాకలి కొండ ప్రాంతాల్లో సాయంత్రం 3 గంటలకు వరికుంటపాడు మండలంలోని తూర్పు చెన్నంపల్లి, రామాపురం గ్రామాల్లో పర్యటించి పనులు పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభన్‌బాబు, డ్వామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి మండలంలో ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 200 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు (పండ్లతోటల పెంపకం) చేపట్టాలని లక్ష్యమన్నారు. ఆసక్తి ఉన్న వారు వన్‌బీ, అడంగళ్, పొలం పాస్‌బుక్, సన్న, చిన్నకారు రైతు సర్టిఫికెట్ జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నీటి వసతి తప్పనిసరిగా ఉండాలన్నారు. 17 రకాల పండ్ల తోటలు పెంచుకోవచ్చన్నారు. రోజా, మల్లె, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు సాగు చేయొచ్చన్నారు. బండ్ ప్లాంటేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసరావు

సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(అర్బన్): దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారు తదితరులు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించి స్లాట్లను బుధవారం విడుదల చేసింది. సర్టిఫికెట్‌లు అవసరమైన వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలలకు స్లాట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

నెల్లూరు కలెక్టర్‌గా మధుర జ్ఞాపకం


హరినారాయణన్‌తో వివిధ శాఖల అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారిగా పనిచేయాలనే కల నెరవేరింది
- ప్రజలకు ఒక్క శాతం మంచి జరిగినా మన ఉద్యోగ ధర్మం నెరవేరినట్లే..
- జనం కోసం పనిచేసే అవకాశం ఒక్క ప్రభుత్వ ఉద్యోగికే దక్కుతుంది
- ఉద్యోగులు, అధికారుల సమన్వయం మరిచిపోలేనిది
- వీడ్కోలు సభలో కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు జిల్లాలో పని చేయడం తన కెరీర్‌లో ఒక మధుర జ్ఞాపకంగా ఉంటుందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. తన సర్వీసులో ఒక్కసారైనా జిల్లా ఎన్నికల అధికారిగా పనిచేసి సమర్థవంతంగా, ప్రశాంతంగా ఆ ప్రక్రియ నిర్వహించాలనే కల ఇక్కడ నెరవేరడం సంతృప్తినిచ్చిందన్నారు. బదిలీ అయిన హరినారాయణన్‌కు జిల్లా అధికారులు సాదరంగా వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌గా 2023 ఏప్రిల్‌లో విధుల్లో చేరగా, 15 నెలల కాలం పనిచేయడం సంతృప్తిగా ఉందన్నారు. తాను 2011లో ఐఏఎస్‌గా ఎంపిక కాగా ట్రెయినీ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ, గ్రేటర్ విశాఖ కమిషనర్, చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా వివిధ హోదాల్లో పని చేశానని, అయితే తనకు జిల్లా ఎన్నికల అధికారిగా పనిచేయాలనే కోరిక మాత్రం నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేయడంతో నెరవేరిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించడంలో అధికారులు, ఉద్యోగులు ఎంతో సహకారం అందించారన్నారు. ప్రజల జీవితంలో ఒక్కశాతం మార్పు తీసుకొచ్చినా ప్రభుత్వ ఉద్యోగిగా మనకు గర్వకారణమన్నారు. ప్రజలతో ఎక్కువగా సత్సంబంధాలు ఉండాలని తాను క్యాంపు ఆఫీసులో కాకుండా కార్యాలయంలోనే విధులు నిర్వహించానని, దీంతో ప్రజలకు దగ్గరగా ఉండే అవకాశం కలిగిందన్నారు. కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. మన వల్ల ఒకరికి మంచి జరిగితే అది మనసుకు చాలా సంతృప్తిగా ఉంటుందన్నారు. వృత్తిపరంగా ఎవరైనా తన వల్ల ఇబ్బంది పడితే అన్యదా భావించవద్దన్నారు. జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అధికారులందరూ పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం హరినారాయణన్ ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ధన్యవాదాలు తెలిపారు. అధికారులతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ లవన్న, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, డీపీఓ సుస్మిత, డీటీసీ చందర్, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.

యువ అధికారులకు మార్గదర్శి

నా ఐదేళ్ల సర్వీసులో హరినారాయణన్ లాంటి కలెక్టర్‌ను చూడలేదు. మాలాంటి యువ అధికారులకు ఆయన మార్గదర్శి. క్రమశిక్షణ, సహకారం, ప్రణాళికాబద్ధంగా పనిచేయడం, ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించడం వంటి గొప్ప లక్షణాలున్న కమిట్‌మెంట్ గల అధికారి.

– వికాస్ మర్మత్, కమిషనర్

కష్టపడి పనిచేసే వ్యక్తి

హరినారాయణన్ వద్ద నేను కేవలం పనిచేసింది మూడు నెలలే అయినా ఎంతో నేర్చుకున్నా. కష్టపడి పనిచేసే తత్వం ఆయనది. ఎంతో ప్రోత్సహించేవారు. మాలాంటి యువ అధికారులకు రోల్‌మోడల్‌గా నిలిచారు.

– సేధు మాధవన్, జేసీ

వివేకానందుని స్ఫూర్తితో పనిచేశారు

స్వామి వివేకానందుని స్ఫూర్తితో హరినారాయణన్ పనిచేశారు. పనిని దైవంగా భావించేవారు. ట్రెయినీ కలెక్టర్‌గా, సబ్ కలెక్టర్‌గా ఆయన వద్ద పనిచేయడం సంతోషంగా ఉంది.

– విద్యాధరి, కందుకూరు సబ్ కలెక్టర్

డ్వామా ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసులు


ఇన్‌చార్జి పీడీని అభినందిస్తున్న ఏపీడీ శంకర్, కార్యాలయ సిబ్బంది

నెల్లూరు(పొగతోట): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఇన్‌చార్జి పీడీగా ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులును నియమించారు. పీడీగా విధులు నిర్వహిస్తున్న వెంకట్రావు ఆరోగ్య కారణాలతో రెండు వారాలు సెలవుపై వెళ్లారు. దీంతో శ్రీనివాసులును నియమించారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా ఏపీడీలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్ల భర్తీ అక్రమాలపై 10న విచారణ

నెల్లూరు(అర్బన్): మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్‌ఏ మేల్) నియామకాలకు సంబంధించి అవినీతి జరిగిందనే ఆరోపణలపై వైద్యశాఖ రీజినల్ డైరెక్టర్ ఈనెల 10వ తేదీన జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. 2002లో హెల్త్ అసిస్టెంట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. అయితే కోర్టు కేసుల నేపథ్యంలో పోస్టులు భర్తీ కాకుండా ఆగిపోయింది. సుదీర్ఘకాలం తర్వాత కోర్టు కేసుల క్లియరెన్స్ నేపథ్యంలో 2018లో వాటిని భర్తీ చేశారు. అయితే ఆ పోస్టుల భర్తీ చేసే క్రమంలో పలు జిల్లాల డీఎంహెచ్‌ఓలు నిబంధనలకు నీళ్లొదిలి రూ.లక్షలాది వసూలు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారంటూ అప్పట్లో వైద్యశాఖకు చెందిన ఒక సంఘం 2018 జూలై 9న వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనరేట్‌కు ఫిర్యాదు చేసింది. అప్పటి ఫిర్యాదుపై ఈనెల 10న విచారణ నిర్వహించనున్నారు.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.30
పండ్లు	: రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 195

ఆధిపత్యం కోసం టీడీపీ నేతల బాహాబాహీ


సభలో బాహాబాహీకి దిగిన టీడీపీ నాయకులు

తోటపల్లిగూడూరు: ఆధిపత్యం కోసం తెలుగుదేశం నాయకులు బాహాబాహీకి దిగిన ఘటన మండలంలోని పాపిరెడ్డిపాళెం సచివాలయంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో బుధవారం సాధారణ గ్రామసభలు జరిగాయి. పాపిరెడ్డిపాళెంలో టీడీపీ గ్రామ ఇన్‌చార్జి కోడూరు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక సర్పంచ్ కదురు సుబ్బయ్య అధ్యక్షతన అధికారులు సభను ఏర్పాటు చేశారు. సుబ్బయ్య ఎన్నికలకు ముందు తన వర్గంతో టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో సభలో పాత, కొత్త నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంది. ఆధిపత్యం కోసం మేనాటి పరంధామయ్య, సర్పంచ్ వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సుబ్బయ్య చుట్టూ ఉన్న వారంతా రౌడీలంటూ పరంధామయ్య వర్గం రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది. అతని అనుచరులపై విరుచుకుపడ్డారు. దీంతో సుబ్బయ్య ఘాటుగా స్పందించారు. టీడీపీలో చేరే సమయంలో, ఎన్నికల్లో పనిచేసేటప్పుడు మాట్లాడని నాయకులు ఇప్పుడు అవసరం తీరాక ఇలా ప్రవర్తించడం సరికాదంటూ ఎదురుతిరిగారు. ఓ దశలో ఇరువర్గాలు తన్నులాట వరకు వెళ్లాయి. ఈ క్రమంలో చంద్రారెడ్డి వారిని శాంతిపజేసేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. సుమారు గంటపాటు బాహాబాహీకి దిగిన పాత తెలుగు తమ్ముళ్లు సభ నుంచి అలిగి వెళ్లిపోయారు. దీంతో అధికారులు 10 నిమిషాల్లో సభను పూర్తి చేసి మమ అన్పించారు.

రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు

ఆత్మకూరు: అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే కూటమి నాయకులను అడ్డుపెట్టుకుని పలువురు పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. రాత్రి వేళల్లో గ్రామాల మీదుగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి మండలంలోని వాశిలి గ్రామ చెరువుకట్ట వద్ద పెన్నానది నుంచి 15 ట్రాక్టర్లలో ఇసుకను అక్రమ రవాణా చేయడం ప్రారంభించారు. గిరిజన కాలనీ మీదుగా ప్రమాదకరంగా వాహనాలు తిరుగుతుండగా వైఎస్సార్‌సీపీ నాయకుడు చెలిక హరిబాబు పలువురితో కలిసి అడ్డుకున్నారు. ఆ ట్రాక్టర్ల వేగానికి ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని గిరిజనులు భయాందోళనకు గురికావడంతో నాయకులు అడ్డగించారు. దీంతో వారికి, ట్రాక్టర్ల డ్రైవర్లకు మధ్య కొద్దిసేపు వివాదం జరిగింది. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నరసాపురానికి చెందిన బీజేపీ నాయకుడు బ్రహ్మయ్య టీడీపీ వారితో వచ్చి హరిబాబుపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ట్రాక్టర్లను తీసుకెళ్లాడని గ్రామస్తులు తెలిపారు. మమ్మల్ని అడ్డుకునేందుకు నువ్వెవరంటూ దుర్భాషలాడారని హరిబాబు వాపోయాడు. ఈ విషయమై సీఐ వేణు, పోలీసు సిబ్బందికి ఫోన్ చేయగా స్పందించలేదన్నాడు. అనుమతి లేకుండా ఇసుక తరలించడం సరికాదని, ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న దృశ్యం

3,140 లీటర్ల డీజిల్ పట్టివేత

ఉలవపాడు: జాతీయ రహదారిపై డీజిల్ అక్రమంగా విక్రయిస్తున్న వారిపై రెవెన్యూ శాఖ బుధవారం దాడులు చేశారు. నిల్వ ఉంచిన 3,140 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల కథనం మేరకు.. కొందరు వ్యక్తులు లారీ డ్రైవర్ల నుంచి తక్కువ ధరకు డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. తర్వాత దానిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి గురించి సమాచారం అందడంతో తహసీల్దార్ చంద్రారెడ్డి, డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రాము సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. వారు డీజిల్ డంప్ చేసి ఉంచిన ప్రాంతాలను పరిశీలించారు. మొత్తం మూడుచోట్ల దాడులు చేశారు. కోటు సురేంద్ర అనే వ్యక్తి వద్ద 130 లీటర్లు, కట్టా చెంచు రామయ్య వద్ద 2,800 లీటర్లు, కలికవాయ కోటేశ్వరరావు వద్ద 210 లీటర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ డీజిల్‌ను చాగల్లు కేవీఆర్ ఫిల్లింగ్ స్టేషన్‌కు అప్పగించారు. నిందితులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.


తనిఖీ చేస్తున్న తహసీల్దార్, డీటీలు

వైద్య పరికరాల కొనుగోలుకు నగదు విరాళం

నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో కంటి వైద్య పరికరాల కొనుగోలుకు గుణపాటి శ్యామలమ్మ అనే మహిళ రూ.15 లక్షలను విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని దివంగత గుణపాటి హరిశ్చంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య శ్యామలమ్మ, కుమారుడు హరిప్రసాద్‌రెడ్డి (రెడ్డీస్ ల్యాబ్) బెజవాడ కృష్ణారెడ్డి ద్వారా హాస్పిటల్ చైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డికి అందజేశారు. నగదుతో కొనుగోలు చేసిన వైద్యపరికరాలైన బీ–స్కాన్, ఫండస్ కెమెరాను బుధవారం ప్రారంభించారు. నగరానికి చెందిన బెజవాడ శ్రీకృష్ణారెడ్డి తమ సోదరీమణుల జ్ఞాపకార్థం రూ.1.23 లక్షలతో స్లిట్ ల్యాంప్ అనే పరికరాన్ని విరాళంగా అందజేశారని సీతారామిరెడ్డి తెలిపారు. ఈ పరికరాలను ప్రారంభించామని, కాటరాక్ట్ ఆపరేషన్స్ ఉచితంగా చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ జీవీ కృష్ణారెడ్డి, సుబ్బారావు, సుధాకర్ పాల్గొన్నారు.


వైద్య పరికరాలను ప్రదర్శిస్తున్న చైర్మన్ తదితరులు

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరంలోని బ్రాహ్మణవీధిలో సుభాని, హీనా (35) దంపతులు నివాసం ఉంటున్నారు. వారి నడుమ స్వల్ప విభేదాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం హీనా తన ఇంట్లోని బెడ్‌రూమ్‌లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన భర్త, మృతురాలి సోదరుడు కలిసి తలుపులు పగులగొట్టి కొన ఊపిరితో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు.

కరేడులో జంప్‌రోప్ జట్ల ఎంపిక రేపు

ఉలవపాడు: మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జంప్ రోప్ జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వ్యాయామ అధ్యాపకుడు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్– 12, అండర్– 14 బాలబాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల వారు జనన ధ్రువీకరణపత్రంతో కరేడు హైస్కూల్‌కు రావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 14న నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

శ్రీసిటీని సందర్శించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

శ్రీసిటీ(వరదయ్యపాళెం): నెల్లూరు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ఐఆర్‌ఎస్ అధికారులు గోరసే ప్రసాద్ దత్తాత్రేయ, కంచన్ రామ్ మీనా బుధవారం శ్రీసిటీని సందర్శించారు. దాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. పారిశ్రామిక నగరం, ప్రగతి, ప్రత్యేకతలతోపాటు శ్రీసిటీ మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తికి ఎలా అద్దం పడుతోంది?, ఉపాధి అవకాశాల సృష్టితోపాటు ఈ ప్రాంతం యొక్క ఆర్థిక అభివృద్ధికి ఎలా దోహదపడుతుందో వివరించారు. శ్రీసిటీ వ్యాపార అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పచ్చని వాతావరణంలో పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు జరిగిన కృషిని ప్రశంసించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన పెందెం వాసు అనే వ్యక్తి అధికంగా మద్యం బాటిళ్లు కలిగి ఉండగా వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద 44 క్వార్టర్ బాటిళ్లు, 12 బీరు బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని వాసుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..

- గంగపట్నం వాసి మృతి

ఇందుకూరుపేట: చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గంగపట్నంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బొప్పి శూలమయ్య (47) వివాహమైంది. పిల్లలున్నారు. గంగపట్నం గ్రామానికి చెందిన శూలమయ్య స్థానికంగా ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో వలలో కాలు చిక్కుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. మృతదేహం తేలుతుండగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరేంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న దృశ్యం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం నెల్లూరు కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. బ్రౌన్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, గ్రే కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.



